క్లుప్తంగా

బాలోత్సవ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

వేంపల్లె : కడప నగరంలో నిర్వహించిన బాలోత్సవ పోటీలలో స్థానిక బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. బాలోత్సవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన చిత్ర లేఖనం, కోలాటం, మట్టిబొమ్మలు తయారీ పోటీలలో ధనుంజయ, ఫజిల్, హమీద్, రామచరణ్, భువనేశ్వర్, శ్రీఆంజనేయ, విజయ సింహ, మల్లికార్జున విద్యార్థులు ప్రతిభ చూపడంతో సర్టిఫికెట్లతోపాటు బహుమతులు అందుకున్నారన్నారు.

ముగిసిన భాగవత పఠనం



భాగవత పఠనం గావిస్తున్న భాగవత పండితులు

లింగాల : తాతిరెడ్డిపల్లెలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో ఆదివారంతో భాగవత పఠనం ముగిసింది. వారం రోజులపాటు భాగవత పండితులు భగవద్గీత సారాంశం, శ్లోకాలు, భాగవత పఠనం గురించి తెలియజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భాగవత పండితులకు సన్మానం చేశారు. అనంతరం భాగవత భక్త సమాజ మండలి మీడియా ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి హైందవ శంఖారావ సభ విశేషాలతో కూడిన నగర మాస పత్రికలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగవత భక్త సమాజ మండలి అధ్యక్షుడు రామకంచిరెడ్డి, భాగవత పండితులు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అచ్చివెళ్లి గంగమ్మ

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చివెళ్లి గంగమ్మ ఆలయంలో వెలసిన గంగమ్మతల్లి అమ్మవారికి ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధిగాంచింది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందించారు.

సైన్స్ అండ్ ఫిజిక్స్‌లో వైవీయూ డాక్టరేట్

జమ్మలమడుగు రూరల్ : మైదుకూరు వైవీయూ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల సైన్స్ అండ్ హ్యుమ్యానిటీస్ ఫిజిక్స్ శాఖ స్కాలర్ జి.హెన్రీ థామస్‌కు శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన ఇన్వెస్టిగేషన్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఫొటో ఓల్టాయిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్ ఆక్సైడ్ (టీఎంఓఎస్) మెడిఫైడ్ హెట్రోజంక్షన్ అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఆ శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.అశోక్‌కుమార్ పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు. ఈయన గతంలో పట్టణ పరిధిలోని అంబవరం గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహించారు.

నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు(చెన్నూరు) : చెన్నూరు టౌన్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు హస్రత్ తండ్రి సయ్యద్ సాహెబ్ (86) (రాయలసీమ సైకిల్ ఛాంపియన్) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి హస్రత్ స్వగృహానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీ నేతలు జీఎన్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ కళ్యాణ్, మైనార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె మాజీ ఎంపీటీసీ లక్షుమయ్యను ఆదివారం మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఇటీవల దవడకు సర్జరీ చేయించుకుని ఇంటి వద్దనే ఉంటున్నాడు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వేంపల్లె : పట్టణంలోని ఎస్సీ కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న 5 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ 12,750 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు.

షెడ్డు వేసేయ్.. దోచేయ్

- టీడీపీ నాయకుల సైడ్ బిజినెస్
- వేంపల్లెలో ఇష్టారాజ్యంగా వ్యాపార సముదాయాలు
- నెలనరి మామూళ్లతో అంగళ్ల ఏర్పాటుకు అనుమతి
- పట్టించుకోని పంచాయతీ, పోలీసులు



వేంపల్లె మెయిన్ రోడ్డులో టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన పానిపూరి సెంటర్



వేంపల్లెలోని అడ్డరోడ్డు సర్కిల్‌లో వ్యాపార తోపుడు బండ్లు

వేంపల్లె : కూటమి ప్రభుత్వంలో అందిన కాడికి దోచుకోవడానికి తెలుగు తమ్ముళ్లు ఆరాటపడుతున్నారు. ప్రధాన రోడ్లలో అనధికారికంగా వ్యాపార సముదాయాలు (షెడ్లు) ఏర్పాటు చేసుకునేందుకు పరోక్షంగా సహకరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందుకోసం వ్యాపారులతో ప్రతినెలా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ నాయకులు ఒకవైపు అక్రమ ఇసుక రవాణా, గ్రావెల్ మట్టి, సెటిల్‌మెంట్, భూకబ్జాలతోపాటు కొత్తగా సైడ్ బిజినెస్ నడిపేందుకు సిద్ధమయ్యారు. ఇష్టారాజ్యంగా వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ పంచాయతీ, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. అధికార పార్టీకి చెందిన నాయకుల సిఫారస్సు ఉండటంతో వారి చేష్టలుడిగి చూస్తున్నారు.

కమర్షియల్ ప్రాంతాలపై గురి

వేంపల్లె పంచాయతీ పరిధిలోని కడప, పులివెందుల, గండి, గాంధీ రోడ్లతోపాటు తదితర ప్రధాన సర్కిళ్లల్లో రోడ్డు ఆనుకొని ఫుట్ పాత్‌పైన వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేశారు. ఏకంగా రేకుల షెడ్లు ఏర్పాట్లు చేసి వ్యాపారాలు చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడ ఆనుకుని రేకు షెడ్లను వేస్తుంటే పంచాయతీ, పోలీస్ యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల పానీ పూరి సెంటర్లు, చికెన్ పకోడా సెంటర్లు, కూరగాయలు, పండ్ల వ్యాపారాలు, టిఫిన్ సెంటర్లు తదితర వ్యాపారాలు చేసుకుంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఉచితంగా పంచాయతీకి చెందిన స్థలాల్లో వ్యాపారాలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. ఎక్కడైనా తోపుడు బండ్లు పెట్టుకుని సాయంత్రానికల్లా వెళ్లిపోయినా సరిపోతుంది. కానీ అటువంటిది ఏకంగా పెద్ద ఎత్తున రేకుల షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాన రహదారుల్లో ఫుట్ పాత్‌పైన రేకుల షెడ్లు వేసుకుంటున్నా పంచాయతీ, పోలీసు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

ఐదు మండలాలకు కూడలిగా ఉన్న వేంపల్లె పట్టణం నిత్యం జనాలతో కిటకిటలాడుతూ ఉంటుంది. అంతేకాకుండా ప్రస్తుతం 65 వేల జనాభా ఉన్న వేంపల్లె మండలం రోజు రోజుకు పెరిగిపోతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలతో అల్లాడుతున్న నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 72 అడుగుల మేర ప్రధాన రోడ్డు విస్తరణ పనులను చేపట్టింది. రోడ్డు విస్తరణలో కోల్పోయిన గృహ, వాణిజ్య సముదాయాల లబ్ధిదారులకు నష్ట పరిహారం అందించారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు విస్తరణ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పాదాచారులు దుమ్ము ధూళితో అవస్థలు పడుతున్నారు.



వేంపల్లె - పులివెందుల ప్రధాన రహదారిలో అనధికారికంగా ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

ప్రధానంగా నాలుగు రోడ్ల కోడలి, హనుమాన్ జంక్షన్, రాజీవ్ నగర్ కాలనీ సెంటర్లతోపాటు ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైనేజీ కాలువ మీద ఫుట్ పాత్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఆ ఫుట్ పాత్‌పై వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధాన రోడ్లు పూర్తయితే ఫుట్ పాత్‌లో ప్రజలు నడవడానికి వీలు లేకుండా పోతుంది.

చర్యలు తీసుకుంటాం



అనధికారికంగా నిర్మాణాలు, షెడ్లు వేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎటువంటి వారైనా ఉపేక్షించేది లేదు. ఇటీవల రేకు షెడ్డు వేసి పానీ పూరి సెంటర్ ఏర్పాటు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. వారికి నోటీసులు ఇచ్చి రేకుల షెడ్డును తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.వెంకటసుబ్బారెడ్డి, పంచాయతీ ఈఓ, వేంపల్లె

నేడు తిరుమలేశుని కల్యాణం

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్లచెరువు గ్రామ సమీపంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మి తిరుమలేశ్వరస్వామి తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 11 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాట కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో పాల్గొను భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం

మైదుకూరు: ప్రాణాలైనా అర్పించి ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 7న జరిగే లక్ష డప్పులు – వేల గొంతులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం మైదుకూరులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని రాయల కూడలి నుంచి డప్పులను వాయిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు కడప రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గత ఆగస్టు ఒకటిన ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరిస్తూ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు, భాస్కర్, మాధవయ్య, నరసింహులు, చిన్నయ్య, సంజీవ్, జయరాముడు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురాయి అక్రమ మైనింగ్‌లను వెంటనే ఆపాలి

పులివెందుల టౌన్ : కడప జిల్లాలో ముఖ్యంగా వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి మండలాలలో వేల కోట్ల రూపాయల ముగ్గు రాయిని కొల్లగొడుతూ వారి ఆర్థిక సామ్రాజ్యాలు నెలకొల్పుకుంటూ రాజకీయాలు చేస్తున్నారని మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వి.శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలోని వేముల మండలానికి చెందిన కొందరు నాయకులు కోట్లాది రూపాయలు కొల్లగొట్టాలన్న ప్రయత్నంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. దీనిపై అధికారులు మిన్నకుండిపోవడం వల్ల ఈ వ్యవహారాలన్ని సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమం చేసేందుకు వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వై.నవీన్, విష్ణు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు పి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలు రాకుండా అడ్డగింపు

పులివెందుల రూరల్ : మండలంలోని కొత్తపల్లిలో మట్టిని తీసుకెళ్తున్న భారీ వాహనాలు రావడంతో రోడ్లు, పంటలు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రబల్లె చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు మట్టిని తరలిస్తూ కొత్తపల్లి గ్రామం మీదుగా భారీ వాహనాలు వెళుతుండటంతో రోడ్లతోపాటు సాగు చేసిన అరటి పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వారు వాపోతున్నారు. వారం రోజుల క్రితం వేసిన తారు రోడ్డు భారీ వాహనాలు రావడంతో నెర్రలు చీలి రోడ్డంతా పగిలిపోయిందన్నారు. భారీ వాహనాలు మట్టి వేసుకుని వస్తుండటంతో రోడ్లపై ఉన్న మట్టి అంతా అరటి గెలలకు పడుతోందన్నారు. భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా గ్రామస్తులు రోడ్డుపైన ముళ్ల కంప, రాళ్లను అడ్డుగా పెట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్డుపై భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొత్తపల్లె రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లకుండా వేసిన ముళ్ల కంప, రాళ్లు

అసాధారణ బడ్జెట్‌పై కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు

వేంపల్లె : 2025–26 ఆర్థిక సంవత్సరానికి పార్లమెంటులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి వారికి భారీగా లాభం చేకూర్చేలా ఉందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.సుష్మా తెలిపారు. ఆదివారం వేంపల్లెలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్య తరగతి ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడంతోపాటు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని కల్పించడం జరిగిందని, అసంఘటిత రంగం వారికి, నెలా జీతం లేని వారికి, వారికి కూడా భరోసా కల్పిస్తూ ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే గ్రామీణ ప్రాంత వాసులకు నైపుణ్యం కల్పించి వారు ఉన్నచోటనే ఉపాధి అవకాశాలు కల్పించి వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా కూడా దేశాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు మోడీ ప్రభుత్వం దేశాభివృద్ధికి ఉపయోగపడేలా ఈ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుకు, విశాఖ స్టీల్ ప్లాంట్ కు, జీరో బడ్జెట్ వ్యవసాయానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపు జరగడం శుభ పరిణామమన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

వేముల : శేషన్నగారిపల్లెలో శ్రీసీతారామ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయంలో పురోహితులు హోమాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా శ్రీరామాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డిలు విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘిస్తే జరిమానా

ముద్దనూరు : ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించి వాహనాలు నడిపేవారిపై తగిన జరిమానా విధిస్తామని సీఐ దస్తగిరి తెలిపారు. ఆదివారం 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా పాతబస్టాండు ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా నడిపినా, హెల్మెట్ లేకున్నా, మద్యం సేవించి వాహనాలు నడిపినా, డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా జరిమానా విధించనున్నట్లు తెలిపారు. రహదారి భద్రత, నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని, ప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఆయన సూచించారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

చక్రాయపేట : మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సయ్యద్ లాలు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సయ్యద్ లాలు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

4 నుంచి శ్రీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు

పులివెందుల టౌన్ : పులివెందులలోని పాత బస్టాండు సమీపంలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం నుంచి 15వ తేదీ వరకు పద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తిచేశారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ఆలయ కమిటీకి తెలియజేశారు. మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని తొలి రోజు బ్రహ్మోత్సవాలను అంకురార్పణతో ప్రారంభించి స్వామివారిని కొలువుతీర్చి సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. 5వ తేదీన ఉదయం ధ్వజారోహణం, సుప్రభాత సేవ, తోమాలసేవ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఊంజలసేవ అనంతరం పెద్ద శేష వాహనంపై స్వామివారికి కొలువుతీర్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు. ప్రతిరోజు సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఊంజలసేవ అనంతరం ఉభయదారులతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 6న చిన్న శేష వాహనం, రాత్రి హంస వాహనం, 7న ఉదయం సింహ వాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం, 8న కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 9న పల్లకిలో మోహినీ ఉత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం, రాత్రి గరుడ వాహనం, 10న ఉదయం హనుమంతుని వాహనం, రాత్రి గజ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే 11న ఉదయం సూర్యప్రభ ఉత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనం, 12న ఉదయం శ్రీవారి రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 13న ఉదయం పల్లకిలో ప్రాకారోత్సవం, స్నపన తిరుమంజనం, చక్ర స్నానం, సాయంత్రం పూర్ణాహుతి, ధ్వజాఅవరోహణ, 14న సాయంత్రం అద్దాల మండపంలో స్వామివారి ఏకాంత సేవ, 15న ఉదయం శ్రీవారి కళ్యాణంతోపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



విద్యుత్ అలంకరణలో శ్రీవేంకటరమణుడి ఆలయం

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

లింగాల : సృష్టిలో స్నేహం ఎంతో ఉన్నతమైందని రిటైర్డు పీఈటీ పి.కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 1997–98 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు 28 ఏళ్ల తర్వాత కలుసుకుని పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వపు విద్యార్థి గురుప్రసాద్ అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు మిత్ర బృందం రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. అనంతరం తమ స్నేహితుడి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అలాగే పాఠశాలకు వాటర్ ప్యూరిఫైడ్‌ను వితరణగా అందించారు.



మిత్రుని కుటుంబ సభ్యులకు రూ.లక్ష అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

మంత్రంలా.. యంత్రాలు

- గంటల్లో ఇంటికి చేరుతున్న ధాన్యం
- ఆధునిక వ్యవసాయ యంత్రాలతో రైతన్నకు తగ్గిన శ్రమ
- విత్తు నుంచి పంట ఇంటికి వచ్చే వరకు మిషన్ తోడు



ట్రాక్టర్ సాయంతో జొన్న పంటను కోస్తున్న యంత్రం



శనగ పంటను కోస్తున్న యంత్రం

పెద్దముడియం : ఒకప్పుడు విత్తు విత్తినప్పటి నుంచి పంట ఇంటికి చేరేవరకు రైతన్నకు కాడెద్దులు తోడుగా ఉండేవి. దీంతో ధాన్యం ఇంటికి చేరాలంటే వారాల సమయం పట్టేది. ప్రస్తుతం ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో మంత్రంలా పని చేస్తున్నాయి. గంటల వ్యవధిలోనే దిగుబడిని ఒడ్డుకు చేరవేస్తున్నాయి. పత్తి, మిరప పంటలుకు తప్పా.. ప్రతి పంటకు కోతకు మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతోందని రైతులు అంటున్నారు.

అవస్థలకు చెల్లు..

గతంలో వరి పంట నూర్పిడికి రైతులు నానా అగచాట్లు పడేవారు. ముందుగా కూలీలతో కోత కోసి అనంతరం పడగేసి ట్రాక్టర్‌తో తొక్కించి ధాన్యాన్ని గాలికి తూర్పారబట్టి సంచులకు నింపేవారు. ఈ తతంగం ఆంతా కనీసం రెండు వారాలు పట్టేది. ప్రస్తుతం పంటల కోతలకు మిషన్లు అందుబాటులోకి రావడంతో కేవలం గంటల వ్యవధిలోనే ధాన్యం ఇంటికి చేరుతోంది. ఎకరాకు ఈ మిషన్లకు గంటకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు చెల్లిస్తున్నారు. ఈ మిషన్లు శనగ, మొక్కజొన్న, గోధుమ, మినుము, పెసర పంటలను నూర్పిడి చేస్తాయి. ఇక ఎతైన పంటలైన జొన్న, సజ్జ, మొక్కజొన్న, కంది పంటల కోత మిషన్ల వల్ల సులభంగా మారింది.

డ్రోన్ సాయం..

పంటలకు కూలీలతో పురుగు మందును పిచికారి చేయాలంటే ఖర్చు, శ్రమతో కూడుకున్నది. ఒక్కో కూలీకి రూ.700 ఇవ్వాలి. అది కూడా ఎకరం మందు పిచికారి చేయాలంటే ఒకరు అవసరం. డ్రోన్‌తో అయితే ఎకరానికి రూ.500తో ఐదు నుంచి పది నిమిషాల్లో పూర్తవుతుంది. డ్రోన్‌ను ప్రస్తుతం ఎక్కువగా వరి, జొన్న, కంది, మొక్కజొన్న పంటలకు ఉపయోగిస్తున్నారు.

వరిగడ్డిని చుట్టలా చుట్టి..

పశువులకు ప్రధాన ఆహార వనరు వరిగడ్డి. వరికోత యంత్రాల ద్వారా వరిగడ్డి వృథా అయ్యేది. దీంతో పశువులకు గ్రాసం కొరత ఉండేది. ప్రస్తుతం వరి గడ్డిని చుట్టలు చుట్టే యంత్రం అందుబాటులోకి రావడంతో సులభంగా గడ్డిని చుట్టగా చుట్టేస్తోంది. ఒక చుట్టను చుట్టేందుకు రూ.30 వసూలు చేస్తున్నారు. ఈ చుట్టను ఇంటికి తెచ్చుకోవడానికి, వాములు వేసుకోవడానికి, మేత వేసేందుకు సులభంగా ఉంటోంది.

పొట్టు కోసం..

పశువులకు గ్రాసం కోసం నూర్పిడి చేసే యంత్రం ట్రాక్టర్ సాయంతో పనిచేస్తుంది. ఈ యంత్రం ద్వారా శనిగ, మినుము, పెసర, వేరు శనిగ పంటలకు సంబంధించిన పొట్టు కావాల్సిన రైతులు ఇళ్ల వద్దకు తెచ్చుకుని నూర్పిడి చేయించుకుంటున్నారు. పొలాల్లో ఆడే యంత్రాల ద్వారా పొట్టు వృథా కాకుండా ఈ మిషను ఉపయోగిస్తారు. ఈ యంత్రం ద్వారా క్వింటా ధాన్యం నూర్పిడి చేస్తే రూ.150 వరకు తీసుకుంటారు.



వరి పంటను కోస్తున్న మిషన్



డ్రోన్ సాయంతో పురుగు మందు పిచికారి



వరిగడ్డిని చుట్టలు చుట్టేస్తున్న యంత్రం

వంకలో మెడికల్ వేస్ట్ చెత్త

చింతకొమ్మదిన్నె : మండలంలోని వివిధ ప్రాంతాలలో మెడికల్ వేస్ట్ చెత్తను ఖాళీ ప్రదేశాలు, వంకలలో వేస్తున్నారు. కొలుములపల్లి తూర్పు వంకలో నిత్యం రైతులు పొలాలకు వెళ్తుంటారు. వంకలో కాలంచెల్లిన మందులు, వాడిన సూదులు, సిరంజీలు, వేస్తున్నారు. కొన్ని రకాల వైరస్‌లు కొన్ని వారాల వరకూ కూడా వాతావరణాన్ని అనుకూలం చేసుకుని జీవించి వుండే లక్షణాలు కలిగి ఇతరులకు ప్రాణంతక వ్యాధులను సంక్రమనకు గురి చేస్తాయి. దీనితో ప్రజలు, రైతులు వంక దారిలో వెళ్లాలంటే భయపడుతున్నారు. మెడికల్ వేస్టును బహిరంగ ప్రదేశాలలో వేయడం ప్రజల ఆరోగ్యానికి హానికరమని వైద్యులకు తెలిసి కూడా ఇలా చేస్తుండటం బాధాకరం. ప్రభుత్వాలు చెత్త నిర్వహణకు చెత్త సంపద కేంద్రాలను అన్ని పంచాయతీలలో నెలకొల్పినప్పటికి ఉపయోగించకుండా చెత్తను సేకరించకుండా వదిలేస్తుండటం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొలుములపల్లి తూర్పు వంకలో పడిఉన్న మెడికల్ వ్యర్థాలు